బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా షేక్ జమీర్



ఎన్నికైన బీఆర్ఎస్ గ్రామ కమిటీ సభ్యులు

గుడిహత్నూర్, జనవరి 18 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో శనివారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. బీఆర్ఎస్ గుడిహత్నూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా షేక్ జమీర్, ఉపాధ్యక్షులుగా ఫడ్ ప్రహ్లాద్, గోవింద్ బుద్ధె, ప్రధాన కార్యదర్శులుగా రంగు శ్రీనివాస్ గౌడ్, ఎండీ గౌస్, కార్యదర్శులుగా సయ్యద్ జాఫర్, కేంద్రె రాము, ఓర్సు సాహెబ్‌రావ్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, మాజీ సర్పంచ్ సునీత, నాయకులు మాధవ్ కేంద్రె, జాదవ్ రమేశ్, సలీంఖాన్, జాదవ్ భీంరావ్ నాయక్, తెలంగే మాధవ్, గఫార్ ఖాన్, ఖలీల్, అంకుష్ కేంద్రె పాల్గొన్నారు.

ఆరోగ్య పాఠశాలపై సమావేశం

ఎదులాపురం, జనవరి 18: ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షి షా శనివారం ఆరోగ్య పాఠశాలపై సమావేశం నిర్వహించారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో వచ్చిన మార్పులను 44 ప్రభుత్వ పాఠశాల నుంచి వచ్చిన స్టూడెంట్ చాంపియన్ విద్యార్థులు కలెక్టర్‌కు వివరించారు. ఆయా పాఠశాలల నుంచి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్టూడెంట్ చాంపియన్లు పాల్గొన్నారు. ఆరు సూత్రాల అమలు ప్రతి సోమవారం వ్యక్తిగత పరిశుభ్రత, మంగళవారం పోషకాహారంపై అవగాహన, బుధవారం ఒత్తిడి నివారించుకునే మార్గాలు, గురువారం డ్రగ్స్‌కు దూరంగా ఉండడం, శుక్రవారం కాలాను గత వ్యాధుల నివారణ, శనివారం వ్యక్తిత్వ వికాసంతో పాటు మరికొన్ని ఆరోగ్య అంశాలను చేర్చి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మార్పు ఎప్పటికీ ఉండాలని, నెల రోజుల పాటు పాటించి వదిలి వేయవద్దని తెలిపారు. ప్రతి రోజూ ప్రతి పాఠశాలలో, ఉదయం ప్రార్థన సమయంలో, సాయంత్రం వేళల్లో ఆరు సూత్రాలతోపాటు యోగా నిర్వహించాలని, అన్ని పాఠశాలలు అరోగ్య పాఠశాలలుగా తీర్చిదిద్దాలని అన్నారు. ఇప్పటి వరకు 133 పాఠశాలలను రివ్యూ చేయడం జరిగిందని అన్నారు. అనంతరం స్టూడెంట్ చాంపియన్ విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో విద్యా శాఖ అధికారి ప్రణీత, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కార్యాలయాలకు తరలివచ్చిన ప్రజలు

ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన జాబితాలో పేర్లు చూసుకుంటున్న ప్రజలు

ఇంద్రవెల్లి, జనవరి 18 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని మండల పరిషత్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రేషన్ కార్డులు, ఆత్మీయత భరోసా పథకం మంజూరు జాబితా ఏర్పాటు చేయడంతో మండల ప్రజలకు కార్యాలయాలకు పరుగులు తీశారు. లబ్ధిదారుల పేర్లు లేకపోవడంతో ఆందోళన చెందారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు కౌంటర్ ఏర్పాటు చేసి జాబితాలో పేర్లు లేని వారికి చెందిన పూర్తి వివరాలు నమోదు చేసుకున్నారు. రేషన్ కార్డుతో పాటు ఆత్మీయత భరోసా మంజూరి జాబితాల్లో పేర్లు ఉన్నా లబ్ధిదారులు మాత్రం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి తమ పూర్తి వివరాలు అధికారులకు అందించారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్చోడ(సిరికొండ), జనవరి 18: ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలో త్వరలో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఉంటుందని పీఆర్ డిప్యూటీ ఈఈ శివరాం అన్నారు. సిరికొండలోని నగేశ్‌నగర్ కాలనీలో దవాఖానకు కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని శనివారం డీఎల్‌పీవో ఫణిందర్‌తో కలిసి పరిశీలించారు. వారి వెంట పీఆర్ డీఈ రాజేశ్వర్, పీఆర్ ఏఈ నర్సింగ్, డిప్యూటీ ఈఈ శివరాం, ఎంపీడీవో రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, పంచాయతీ కార్యదర్శి అరుణ్, గ్రామస్తులు లక్ష్మణ్, రవి, లస్మన్న, దత్తు, మల్లేశ్, పెంటన్న, చందు ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న నిర్మల్ డీఈవో రామారావు

ఖానాపూర్ టౌన్, జనవరి 18: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను శనివారం డీఈవో రామారావు తనిఖీ చేశారు. పదో తరగతి బోధించే ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ప్రత్యేక తరగతుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ఆర్థిక సాయం

లోకేశ్వరం, జనవరి 18 : నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం జోహర్‌పూర్ గ్రామానికి చెందిన బొంబాయి రాజు ఇటీవల అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఉండడానికి ఇల్లు లేక తిన డానికి తిండి లేక ఆ కుటుంబం దినంగా ఎదురుచూస్తుంది. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుమారుడు దిగంబర్ వారికి తనవంతుగా రూ. 2 వేలు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఇక్కడ యువకులు పోతన్న, యోగేశ్, సాయికుమార్, సాయి ఉన్నారు.

దివ్యాంగులకు బస్‌పాసులు అందజేత

కుంటాల, జనవరి 18 : టీజీ ఆర్టీసీ నిర్మల్ డిపో ఆధ్వర్యంలో దివ్యాంగులకు 50 శాతం రాయితీ బస్‌పాసులను ఆర్టీసీ సిబ్బంది శనివారం పలువురు దివ్యాంగులకు అందజేశారు. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని ఓలా, సూర్యపూర్, అంబకంటి , కుంటాల, కల్లూరులో పాసులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది బీ శంకర్, పంచాయతీ కార్యదర్శులు రాజబాపు, సుమన్, భోజన్న, కారోబారి మోహన్, శంకర్ పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

కుభీర్, జనవరి 18 : నిర్మల్ జిల్లా కుభీర్‌లోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఖాళీ స్థలంలో నూతనంగా నిర్మించిన తహసీల్ కార్యాలయ స్థలాన్ని శనివారం ఆర్అండ్‌బీ ఏఈ సునీల్‌బాబు పరిశీలించారు. సరిపడా స్థలం ఉందన్నారు. కొలతలు తీసి నమోదు చేసుకున్నారు. ఆయన వెంట దత్తు, శేఖర్, శంకర్, భూమన్న, సురేశ్ ఉన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

అధ్యాపకులకు సూచనలు ఇస్తున్న డీఐఈవో జాదవ్ పరశురాం

కుభీర్, జనవరి 18: నిర్మల్ జిల్లా కుభీర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం డీఐఈవో జాదవ్ పరశురాం తనిఖీ చేశారు. ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు గాను 90 రోజుల ప్రణాళిక ప్రకారం విద్యార్థులు సన్నద్ధం అయ్యేందుకు తమ వంతు కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. తరగతి గదులకు వెళ్లి నోట్స్, హాజరు శాతాన్ని పరిశీలించారు. హాజరు శాతాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ సునీల్, కండ్రాతి సంపత్, అధ్యాపకులు ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో విద్యుత్ మీటర్లు దగ్ధం

ఖానాపూర్, జనవరి 18: నిర్మల్ జిల్లా ఖానాపూర్ శివారులోని కుమ్రం భీం చౌరస్తా వద్ద డబుల్ బెడ్రూం ఇండ్లలో శనివారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో 24 విద్యుత్ మీటర్లు దగ్ధమయ్యాయి. నాణ్యత లేని వైర్లను అమర్చడంతో బీ-5 బ్లాక్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు స్థానికులు తెలిపారు. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కాలనీ వాసులు భయభ్రాంతులకు గురై ఆందోళన చేశారు. అనంతరం మున్సిపల్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేయడంతో విద్యుత్ శాఖ లైన్‌మెన్‌లు సరఫరాను నిలిపివేశారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

జైనథ్, జనవరి 18 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పార్టీ(కే) రామాయి గ్రామాల మధ్య ప్రవహిస్తున్న సాత్నాలవాగులో శనివారం ఉదయం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాయి గ్రామానికి చెందిన టాప్రె అనిల్(34) చేపల వేటకు వెళ్లి సాత్నాల నదిలో మునిగి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు జైనథ్ ఎస్ఐ పురుషోత్తంకు ఫిర్యాదు చేయగా శవ పంచనామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో ఆరుగురికి గాయాలు

ముథోల్, జనవరి 18 : నిర్మల్ జిల్లా ముథోల్‌లో శనివారం విధి కుక్కలు స్వైర్య విహారం చేశాయి. స్థానికుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని కోట్‌గల్లీ, కాల్వగల్లీ, దోబీగల్లీకి చెందిన ఆరుగురిపై దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను భైంసా ఏరియా దవాఖానకు తరలించారు. సంబంధిత అధికారులు వీధి కుక్కల బారి నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజావాణి రద్దు

ఎదులాపురం, జనవరి 18: ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో ఈ నెల 20వ తేదీన నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నామని కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 26న అమలు చేయనున్న నాలుగు పథకాలపై సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ వెరిఫికేషన్ చేపడుతున్న సందర్భంగా ప్రజావాణిని రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు, అర్జీదారులు దీనిని గమనించి కలెక్టరేట్‌కు రాకూడదని కోరారు.

పేదలను ఆదుకోవడమే లక్ష్యం

ఇంద్రవెల్లి, జనవరి 18: గ్రామీణ ప్రాంతంలోని పేదలను గుర్తించి వారికి ఆదుకోవడమే తమ లక్ష్యమని హైమన్ డార్ఫ్ బెట్టి ఎలిజీబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దుర్వ సంతోష్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన ఆత్రం మారుతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న హైమన్ డార్ఫ్ బెట్టి ఎలిజీబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సంతోష్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులతో పాటు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్‌గౌడ్, తెలంగ్‌రావ్, మడావి భీంరావ్ పాల్గొన్నారు.

గిరిజన రైతు హత్య ప్రభుత్వానిదే

ఉట్నూర్, జనవరి 18: గిరిజన రైతు జాదవ్ దేవ్‌రావ్ ఆత్మహత్య ప్రభుత్వానిదే బాధ్యత అని బీఆర్ఎస్ నాయకుడు, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు భరత్ చౌహాన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందులో భాగంగానే రైతు ఆత్మహత్యలు జరుగుతున్నాయన్నారు. రైతు ఆత్మహత్య చేసుకున్న ఇప్పటి వరకు కలెక్టర్, ఎస్పీలు స్పందించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తాండాలకు వెళ్లి దూషించి బాకీ కట్టాలని డిమాండ్ చేసిన బ్యాంక్ అధికారులపై కేసులు నమోదు చేయాలన్నారు. గిరిజనులు ఉండే జిల్లాలో ప్రైవేట్ బ్యాంకులను నిషేధించాలన్నారు.

బ్యాంకులో భద్రత, ప్రొటోకాల్ వ్యవస్థ పరిశీలన

భైంసా, జనవరి 18 : భైంసాలోని ఎస్‌బీఐ, ముత్తుట్ ఫైనాన్స్ అండ్ గోల్డ్ లోన్‌లో శనివారం పట్టణ సీఐ గోపీనాథ్ భద్రత వ్యవస్థలను ప్రోటోకాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు, మోసాలు ఇతర ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తుగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అంతేగాకుండా ప్రత్యేక భద్రత, ప్రధాన ద్వారాలు, వెనుక ప్రవేశాలు, అత్యవసర మార్గాలను పరిశీలించినట్లు తెలిపారు. సీసీ టీవీ కెమెరాల నాణ్యతను పరిశీలించామన్నారు. నగదు నిర్వహణ విధానాలు, డిపాజిట్, విత్‌డ్రా, ఏటీఎం విత్‌డ్రాల కోసం ప్రోటోకాల్ ఎలాంటి అనుసరించబడుతున్నాయో వాటిని సైతం పరిశీలించారు. ఇక్కడ పోలీసు సిబ్బంది ఉన్నారు

నరకయాతన

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 18: నిర్మల్ మాతా శిశు ఆరోగ్య కేంద్రం ప్రధాన గేటు వద్ద మురుగు కాలువపై ఉన్న గ్రిల్స్‌లో అనుకోకుండా ఓ గర్భిణి కాలు ఇరుక్కుపోవడంతో అరగంటకు పైగా అవస్థపడింది. వివరాలకు వెళ్లితే.. నిర్మల్‌లోని బంగల్‌పేటకు చెందిన జ్యోతిక ఏడు నెలల గర్భిణి. శనివారం నిర్మల్ మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి పరీక్షల నిమిత్తం వచ్చింది. అయితే దవాఖాన వద్ద డ్రైనేజీపై ఏర్పాటు చేసిన గ్రిల్స్‌లో అనుకోకుండా కాలు ఇరుక్కుంది. గర్భిణి కావడంతో తీవ్ర ఇబ్బంది పడింది. అరగంటకు పైగా అవస్థ పడింది. స్థానికులు సంఘటన స్థలంలో పలు పరికరాలతో కాలును బయటకు తీశారు. ఈ ఘటనలో గర్భిణికి ప్రమాదం తప్పగా స్వల్పంగా గాయపడింది.

దవాఖాన వద్ద డ్రైనేజీపై ఉన్న గ్రిల్‌లో ఇరుక్కున్న కాలు

ఉద్యోగ కల్పనలో డీట్ యాప్ ఎంతో ఉపయోగం

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 18 : నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ కల్పనలో డీట్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ జిల్లా కమిటీ సభ్యులతో శనివారం కలెక్టర్ అదనపు కలెక్టర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువకులకు ఉద్యోగకల్పనకై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన డీట్ యాప్‌లో కళాశాలల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకునే విధంగా అధికారులు ప్రోత్సహించాలన్నారు. అధికారులు ఈ యాప్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో పరిశ్రమల మేనేజర్ నర్సింహారెడ్డి, సీపీవో జీవరత్నం, మెప్మా పీడీ సుభాష్, జిల్లా కార్మిక అధికారి ముత్యంరెడ్డి, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

జాతీయ అధ్యక్షుడిపై ఫిర్యాదు

ఎదులాపురం, జనవరి 18: మంచిర్యాల జిల్లాలో శుక్రవారం మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగపై మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్ మూర్తి చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పసుల రామ్ మూర్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శులు బొల్లారపు నందకిశోర్, ఆరెపల్లి రాజేశ్, సీనియర్ నాయకులు వినయ్ సాగర్, గుర్రాల ఆశన్న, టౌన్ నాయకులు పెద్దింటి సూర్యప్రసాద్, మురళి ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

సారంగాపూర్, జనవరి 18: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి గ్రామానికి లక్ష్మి, చిన్నమ్మల రెండు ఇళ్లు అగ్నిప్రమాదంలో కాలిపోయిన విషయం తెలిసిందే. అయితే గ్రామానికి చెందిన మ్యాక్స్ సభ్యులు బాధిత కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి రూ. 10వేల చొప్పున ఆర్థిక సహాయంగా రూ. 20వేలు అందజేశారు. ఇక్కడ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శంకర్‌రెడ్డి, మ్యాక్స్ అధ్యక్షుడు గంగారెడ్డి, మాక్స్ సభ్యులు నర్సన్న ఉన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి

తాంసి, జనవరి 18: ఆలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ గంగోని శ్రీనివాస్ అన్నారు. శనివారం తాంసి మండలంలోని వడ్డడి గ్రామంలో ప్రసిద్ధి గాంచిన స్వయం భూ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయాన్ని దర్శించుకొని పూజలు చేశారు. ఆయన వెంట చీఫ్ మేనేజర్ సత్యనారాయణ, మేనేజర్ బాలకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు శ్రీకాంత్, గంగాధర్, కిష్టయ్య, పోతన్న, సత్యనారాయణ, మల్లయ్య, నర్సింగ్, స్వామి, నాందేవ్ ఉన్నారు.

సరిహద్దులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలి

సారంగాపూర్, జనవరి 18: అటవీ సరిహద్దులు అన్యాక్రాంతం కాకుండా చూడాలని నిర్మల్ జిల్లా ఎఫ్ఆర్‌వో రామకృష్ణరావు అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని అడెల్లి ఆర్ఎఫ్ సరిహద్దులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సరిహద్దులు అన్యాక్రాంతం కావద్దని, ఎన్‌క్రోచ్‌మెంట్ కాకుండా ఫారెస్టు సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఆర్వో నజీర్‌ఖాన్, ఎఫ్‌బీవో స్వప్న ఉన్నారు.

జాన్సన్ నాయక్‌ను కలిసిన నాయకులు

జాన్సన్ నాయక్‌కు వార్షికోత్సవ ఆహ్వానపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఖానాపూర్, జనవరి 18: బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌ను శనివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు నిర్వహించే వీరంజనేయ శ్రీ శివ సాయిబాబా ఆలయ 28వ వార్షికోత్సవానికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రం అందజేశారు. అనంతరం నియోజకవర్గంలోని పలు అంశాలపై నాయకులతో జాన్సన్ నాయక్ సుదీర్ఘంగా చర్చించారు. ఇక్కడ ఆలయ కమిటీ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ అంకం రాజేందర్, మాజీ ఎంపీపీ మొయిద్, నాయకులు కొక్కుల ప్రదీప్, కరిపె శ్రీనివాస్, బీసీ రాజన్న, శ్రావణ్, ద్యావతి రాజేశ్వర్, గంగాధర్ ఉన్నారు.

అంబులెన్స్ కేటాయించాలి

కుంటాల, జనవరి 18 : కుంటాలకు 108 అంబులెన్స్‌ను కేటాయించాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తు శనివారం మండల కేంద్రం పర్యటనకు వచ్చిన కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతి పత్రం అందజేశారు. మండలంలో మారుమూల గ్రామాలలోని ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని అన్నారు. అలాగే రేషన్ కార్డులు అర్హులందరికీ ఇవ్వాలని, ఇతర సమస్యలపై కూడా పలువురు గ్రామస్తులు జక్కులు గజేందర్, కృష్ణ, తదితరులు కలెక్టర్‌కు విన్నవించారు.

ఎయిడ్స్ బాధితులకు మెరుగైన సేవలు అందించాలి

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 18 : ఎయిడ్స్ బాధితులకు మెరుగైన సేవలందించాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్త సంచాలకుడు డాక్టర్ భూసారపు రవికుమార్ అన్నారు. నిర్మల్‌లోని ఐసీటీసీలను, షూర్ ఎన్జీవో, ఉపకారాగారాన్ని, భైంసా ప్రాంతీయ దవాఖానలను ఆయన సందర్శించారు. హెచ్ఐవీ ఎయిడ్స్ కార్యక్రమాల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. హెచ్ఐవీ నియంత్రించడానికి ప్రజల్లో అవగాహన కల్పించాలని, నిర్ధారణ పరీక్షలు పెంచాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎయిడ్స్ నియంత్రణకు అనేక కార్యక్రమాలు చేపడుతుందని వాటిని క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడంలో సిబ్బంది అంకితభావంతో పని చేయాలని అన్నారు. ఆయన వెంట ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల క్లస్టర్ ప్రోగ్రాం అధికారి నాగరాజు, జిల్లా పర్యవేక్షకుడు అనిల్‌కుమార్, షూర్ ఎన్జీవో ప్రోగ్రాం మేనేజర్ మల్లికార్జున్, ఐసీటీసీ కౌన్సిలర్లు ఎన్జీవో సిబ్బంది ఉన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న సంయుక్త సంచాలకుడు భూసారపు రవికుమార్

సెల్‌ఫోన్లు అందజేత

సెల్‌ఫోన్లు అందజేస్తున్న నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ అర్బన్, జనవరి 18: నిర్మల్ జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌కు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జానకీ షర్మిల రెండు సెల్‌ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరాలకు సంబంధించిన సాక్ష్యాలు చెదిరిపోకుండా ఫొటోలు, వీడియోలు తీసేందుకు దోహద పడుతాయన్నారు. యాప్ ద్వారా నేరానికి సంబంధించిన రికార్డులను కోర్టులో ప్రవేశపెట్టడం ద్వారా నేరస్తులకు త్వరితగతిన శిక్షలు విధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

పోస్టర్ విడుదల చేస్తున్న ఎఫ్ఆర్‌వో, ఎఫ్ఎస్‌వో, ఎఫ్‌బీవోలు

బోథ్, జనవరి 18: వన్యప్రాణులను సంరక్షించడం అందరి బాధ్యత అని బోథ్ ఎఫ్ఆర్‌వో ప్రణయ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని రేంజ్ కార్యాలయంలో పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను హతమరిస్తే మూడు నుంచి ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు రూ.లక్ష వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి అమర్‌సింగ్, ఎఫ్ఎస్‌వోలు నాగోరావ్, ముంతాజ్, జూనియర్ అసిస్టెంట్ పరశురాం, ఎఫ్‌బీవోలు సంధ్యారాణి, నాగోరావ్, ధన్‌రాజ్, అనిల్, రాధేశ్యాం పాల్గొన్నారు.

పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలి

గోదాదేవి కల్యాణోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న రామన్న

జైనథ్, జనవరి 18 : ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలు పాడి-పంటలతో చల్లంగా ఉండాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న వేడుకున్నారు. గ్రామంలో గోదాదేవి రంగనాథస్వామి కల్యాణోత్సవానికి పూజలు నిర్వహించారు. ఆయన స్వగ్రామం అయిన దీపాయిగూడకు రాగా.. గామస్తులు స్వాగతం పలికారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి, కల్యాణోత్సవ అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నాయకులను పూలమాలలు, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణ, మాజీ సర్పంచ్ లు అడప తిరుపతి, ఊశన్న, బొల్లి గంగన్న, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా స్మృతి దివస్

ఎదులాపురం, జనవరి 18: సమాజంలో చెడు విస్తరించడానికి, ప్రజలకు మంచి మార్గాన్ని సూచించే వారు లేకపోవడమే ప్రధాన కారణమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్‌లోని బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో ప్రజాపిత బ్రహ్మబాబా ఆవివక్త దినాన్ని పురస్కరించుకొని స్మృతి దివస్‌ను ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి జోగు రామన్న, బ్రహ్మ కుమారీలతో కలిసి ముందుగా బాబా చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి పుష్పాంజలి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారిలు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం